
ప్రజాశక్తి
సోమవారం 17 ఫిబ్రవరి 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు




చర్మవ్యాధులపై అవగాహన అవసరం

నెల్లూరు : చర్మవ్యాధులపై అవగాహన అవసరమని డాక్టర్ ఎస్.శ్వేత అన్నారు. ఆదివారం, మాగుంట లేఔట్ లోని శ్వేత ఎస్థెటిక్స్ (బ్రైట్ స్కిన్ క్లినిక్) రెండవ బ్రాంచ్ ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చర్మవ్యాధులు వంశపారంపర్యంగా, కాలుష్యం వలన, దెబ్బలు తగలడం వలన కూడా సంక్రమిస్తాయన్నారు. చర్మ వ్యాధివల్ల మానసిక పరిస్థితి ఆందోళనగా మారడమే కాకుండా నూన్యత భావం కూడా ఏర్పడుతుందన్నారు. చర్మ వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. చర్మ వ్యాధులపై అనుమానం కలిగిన వెంటనే వైద్యులు సంప్రదించాలని ఆమె సూచించారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్వేత, డాక్టర్ ప్రేమ్ దీప్ లను శాలువా, పూల మొక్కతో ఘనంగా సన్మానించారు. పీ.హెచ్.పీ జిల్లా గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్, నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, ఉప్పలపాటి రామదాసు, నంద్యాల మాలిని, శంకర్రావు, శ్రీధర్ రావు, రాజశేఖర్ ఉన్నారు.



బడ్జెట్‌లో 'ప్రత్యేక' హోదా ఊసేలేదు..!

- ◆మూడు పార్టీలు ఏమీ మాట్లాడవు
- ◆భారీ పెట్టుబడుల పేరుతో మోసం
- ◆సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు


మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో రాష్ట్రానికి దోహం చేసిందని, ఎక్కడా ప్రత్యేక హోదా ఊసేలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో వామపక్షాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై నిర్వహించిన సదస్సుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నిర్మాలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏం వచ్చాయెూ ఆ మూడు పార్టీలకు తెలియడం లేదన్నారు. టిడిపి, జనసేన, వైసిపిలు బడ్జెట్ బాగు బాగు అంటూ చంకలు గుద్దుకుంటున్నాయే తప్ప, అందులో ఏముందో చెప్పడం లేదని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తేనే అనేక పరిశ్రమలు ఇక్కడకు వస్తాయని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. విద్యకు, మూడు శాతం, వైద్యానికి ఆరుశాతం జిడిపిలో ఖర్చుపెట్టాలని, అప్పుడు ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఇప్పుడు రెండింటికి కలిపి కేవలం 1.5 శాతం మాత్రమే బడ్జెట్‌లో పెట్టారన్నారు. మిగిలిన భారమంతా ప్రజలపైనే పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉపాధి పథకం ద్వారా ఉపయోగం జరిగిందన్నారు. కేరళలో రోజు కూల రూ 600 ఉంటే ఇక్కడ కేవలం రూ 250 మాత్రమే ఉందన్నారు. పిల్లలను కనమని చంద్రబాబునాయుడు చెబుతున్నారని, మార్కెట్లో కూలీలను పెంచడానికేనన్నారు. బడ్జెట్‌ను పూర్తిగా వ్యతిరేకించాలన్నారు. బడ్జెట్ గురించి ఎంపిలు ఏమీ చెప్పడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు వరిగింది ఏమీ లేదన్నారు. పెట్టుబడి దారులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని, పరిశ్రమల పేరుతో భూములు తీసుకొని, మళ్లీ ఆ భూములు బ్యాంకుల్లోనే తాకట్టు పెట్టి దోచుకుంటున్నారని విమర్శించారు. మూడేళ్ల కాలంలో పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలు రూ 12 లక్షల కోట్లు ఎగొట్టాయన్నారు. సంక్షేమ పథకాలు ఇవ్వడం వల్ల సోమరితనం పెరిగిందని ప్రచారం చేస్తున్నారని, అందులో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. అమెరికా పెత్తందారీ తనానికి మోదీ దాసోహం అయ్యారని విమర్శించారు. ప్రపంచంలోని చిన్న చిన్న దేశాలు అమెరికా విదానాలకు వ్యతిరేకిస్తుంటే మోదీకి నోట మాట రావడం లేదన్నారు. ఎఫ్ 35 విమానాలు కాలం చెల్లాయని, ఏడాది క్రితమే మస్క్ ఈ విషయం చెప్పారని, వీటిని అమెరికా భారత్‌కు అంటకట్టిందన్నారు. భారత్ , అమెరికాకు జరిగిన వాణిజ్యంలో అమెరికా లోటులో ఉందన్నారు. 500 మిలియన్ (5 లక్షల కోట్లు) డాలర్లు పెట్టి ఈ ఏడాది . ఆయల్, ఆయుదాలు, గ్యాస్ కొనుగోలు చేస్తున్నారన్నారు. భారత్ నష్టపోగ, అమెరికా లాభపడుతుందన్నారు. ఆయిల్, గ్యాస్, దయతో ఇస్తున్నారని ప్రభుత్వం చెబుతోందని, ఇది పూర్తిగా దగా అన్నారు. గత ఐదేళ్లగా అమెరికా భారత్‌పై ఒత్తిడి తీసు కొస్తుందని తెలిపారు. ఇరాన్, రష్యా నుంచి అయిల్, గ్యాస్ దిగుమతి చేసు కుంటున్నారని, దీనిని ఒప్పుకోమని అమెరికా బెదిరింపులకు దిగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇక్కడ పెట్టుబడి దారులకు ఆదాయం చేకూర్చేలా వ్యవహరిస్తుందన్నారు. ఇరాన్, రష్యా నుంచి ఆయిల్, గ్యాస్ దిగుమతి చేసుకోవడం వల్ల కొంత కాలంగా ధరలు స్థిరంగా ఉన్నాయన్నారు. ఈ దేశాలకు డాలర్లలో చెల్లించాల్సిన అవసరం లేదని, రూపాయిల్లోనే చెల్లిస్తున్నామన్నారు. అమెరికా భారత్‌పై ఒత్తిడి తెచ్చి ఆయిల్, గ్యాస్ కొనుగోలు చేయించేలా చూస్తున్నారన్నారు. అమెరికాకు లొంగిపోయి దేశాన్ని మోదీ తాకట్టు పెడుతు న్నారన్నారు. డంప్ పెద్ద వ్యాపారవేత్తనని ప్రపంచ వ్యాపితంగా అన్ని కంపెనీలను బోల్తా కొట్టించగల సమర్థుడని మోదీ అమెరికాకు రాకముందే అదానీకి లాభం చేకూర్చేలా నిర్ణయాలు చేశారన్నారు. చంద్రబాబు నాయుడు రోజు విదేశీ కంపెనీలు వస్తాయని, లక్షల కోట్లు పెట్టుబడులు వస్తాయని, ఊరిస్తున్నారన్నారు. ఇటీవల దావోస్‌లో అంతర్జాతీయ సదస్సులో ఒక్క ఒప్పందం జరగలేదన్నారు. తెలంగాణా, మహారాష్ట్రకు కొంత పెట్టుబడి వచ్చాయన్నారు. ట్రంప్ అమెరికా ఫస్ట్ అంటుటే మోదీ వికసిత్ భారత్ అంటూ పాటపడు తున్నారన్నారు. అమెరికా మార్కెట్‌ను కాపాడుకోడానికి ప్రపంచంలోని అనేక దేశాలపై ఆంక్షలు పెట్టారని తెలిపారు. అమెరికా 109 మంది భారతీయులకు బేటిలు వేసి, నీళ్లు, అన్నం లేకుండా ఇక్కడ వదిలి పెట్టారని, ఇలానే బ్రెజిల్‌కు పంపితే అక్కడ ప్రభుత్వం విమానాలను తిరిగి పంపిందన్నారు. భారతీయులకు జరిగిన అవమానం గురించి మోడీ కనీసం నిరసన తెలపలేదన్నారు. భాతర్ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని, సంక్షోభంలో ఉన్న అమెరికాకు మోడీ ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. చైనాను చూసి అమెరికా భయ పడుతుంటే, అమెరికాను చూసి భారత్ భయప డుతుందన్నారు. విదేశీ పెట్టుబడులు ఏమీ రావడం లేదని, బడ్జెట్‌కు ముందే మూడు లక్షల కోట్లు షేర్ మార్కెట్ భయపటకు వెళ్లిపోయిందన్నారు. ఇక్కడ ఏమీ లాభాలు రాకపోవడంతో వెళ్లిపోతున్నారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో భారత్‌కు విదేశీ పెట్టుబడులు రావడం అంతా ఒక కల అన్నారు. బడ్జెట్‌లో . కడప ఉక్కు ప్రస్తాన లేదని, రైల్వే జోన్ విషయంలో స్పష్టత లేదని తెలిపారు విశాఖ ఉక్కుకోసం రూ 11,500 కోట్లు ఇచ్చినట్లు చెబుతున్నారని, క్రమేపీ దీనిని ప్రవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడానికి కుట్ర జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, సిపిఐ(ఎంఎల్) న్యూడెక్రసి జిల్లా నాయకులు రాంబాబు, పార్వర్డ్‌బ్లాక్ జిల్లా నాయకులు నరసింహులు, సిపిఐ జిల్లా నాయకులు మాలకొండయ్య పాల్గొన్నారు.


సభకు హాజరైన ప్రజలు


సిఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : 20 మంది లబ్ధిదారులకు రూ. 19,01,127 సిఎంఆర్ సహాయ నిధి చెక్కుల ఎంఎల్ఏ శ్రీ ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రాష్ట్రంలో పేదల ఆరోగ్య విషయంలో కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంత మొత్తంలో డబ్బులు ఖర్చు పెట్టడానికైనా సిద్ధంగా ఉన్నారని ఎంఎల్ఏ ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడారు. కందుకూరు నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 20 మందికి సిఎం సహాయ నిధి ద్వారా చెక్కులను ఎంఎల్ఏ ఇంటూరి నాగేశ్వరరావు పంపిణీ చేశారు గత వైసిపి ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్య విషయంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించిం దన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు .టిడిపి నాయకులు చిలకపాటి మధుబాబు, చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాద్, ముచ్చు శ్రీను, చెరుకూరి సూర్యనారాయణ, గుమ్మడి బ్రహ్మయ్య, అమరనేని రాములు, కొల్లి అవినాష్ ఉన్నారు.

ఎంఎల్ఎ 'ఇంటూరి' ఆశీర్వాదం

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు పట్టణంలోని గుర్రంవారిపాలెంకు చెందిన మిరియం యానాది చౌదరి కుమార్తె పవిత్ర వివాహం సందర్భంగా ఇంటి వద్ద జరిగిన కార్యక్రమానికి హాజరై పెండ్లి కుమార్తె ను కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం ఆశీర్వదించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య, చిలకపాటి మధుబాబు బెజవాడ ప్రసాద్, పొడపాటి మహేష్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పూలే దంపతుల జీవితం స్ఫూర్తిదాయకం

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

ప్రజాశక్తి-నెల్లూరు

మహాత్మా జ్యోతిరావు పూలే - సావిత్రీబాయి పూలే దంపతుల జీవితం స్ఫూర్తిదాయకమని గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన నగరంలోని స్టోన్ హౌస్ పేట పప్పుల వీధిలోని ఎడ్లపల్లి వెంకటేశ్వర్లు నగరపాలక ఉన్నత పాఠశాలలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆవిష్కరించారు. బండారు ఈశ్వరమ్మ పొదుపు గ్రూపు సౌజన్యంతో జాతీయ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఈ విగ్రహాలను ఏర్పాటు చేశారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు కృషి చేసిన మహనీయుడు పూలే అన్నారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని వెనుకబడిన వర్గాల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు పూలే చేసిన కషి వెలకట్ట లేనిదన్నారు. పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించడం తన అదష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే సతీమణి సావిత్రిబాయి దేశంలో మొట్టమొదటి విద్యా సంస్థను స్థాపించి మహిళా విద్యకు విశేషంగా కషి చేశారని చెప్పారు. పూలే దంపతుల సేవలను స్మరించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం కూడా మహిళలకు అన్ని విధాల అండగా ఉంటూ ప్రోత్సహిస్తుందని చెప్పారు. తొలుత హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయకు ఆర్డిఓ అనూష స్వాగతం పలికారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ , మాజీ పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, జాతీయ బిసి సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.


పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న దత్తాత్రేయ

స్వర్ణ భారత్ ట్రస్ట్‌కు మంత్రి లోకేష్ రాక

ఘన స్వాగతం పలికిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు


వెంకటాచలం స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆవరణంలో మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు మనుమడు వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు వెంకటాచలం టోల్గేట్ వద్ద పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి ,నగర డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

హర్యానా గవర్నర్‌ను కలిసిన లోకేష్

వెంకటాచలం స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆవరణంలో మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు మనుమడు వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరైన హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను రాష్ట్ర ఐటిశాఖ మంత్రి నారాలోకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు.పరస్పరం అభివాదం చేసుకున్నారు.

కోటంరెడ్డి సోదరులతో లోకేష్ పలకరింపు

వెంకటాచలం స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆవరణంలో మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు మనుమడు వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని ఆత్మీయంగా పలకరించారు.వీరితో పాటు నగర డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్ కూడా ఉన్నారు.రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిని ఆత్మీయంగా పలకరించారు. నెల్లూరు రూరల్ లో చక్కగా పనిచేస్తున్నారని ప్రశంసించారు


మంత్రితో మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీధర్‌రెడ్డి



ముఖ్యమంత్రికి 37 వినతులు

ప్రజాశక్తి- కందుకూరు

సిఎం చంద్రబాబునాయుడుకి 37 వినతులు ప్రజల నుంచి అందాయని అధికారులు తెలిపారు. శనివారం కందుకూరు వచ్చిన సిఎం నారా చంద్రబాబు నాయుడికి అందించిన అర్జీలలో 5 ఎన్‌టిఆర్ భరోసా, 5 ఇళ్ల స్థలాలు, 5 భూసేకరణ నష్టపరిహారం, రీసర్వే, ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ తదితర సమస్యలపై ఉన్నాయి. సమస్యలపై స్పందించిన చంద్రబాబు తక్షణమే వీటిని పరిష్కరించాలని కలెక్టర్‌ను ఆదేశించారని అధికారులు తెలిపారు.


మాట్లాడుతున్న కెసి పెంచలయ్య

ఏప్రిల్ 14న 'ఎస్‌టి వర్గీకరణ భేరి'

యానాదుల సంక్షేమ సంఘం

ప్రజాశక్తి-నెల్లూరు

ఏప్రిల్ 14వ తేదీన నగరంలో ఎస్‌టి వర్గీకరణ భేరీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.సి పెంచలయ్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని గిరిజన భవన్‌లో యానాదుల సంక్షేమ సంఘం, యానాది గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం దిశగా ముందుకెళుతున్న కూటమి ప్రభుత్వం ఎస్‌టి వర్గీకరణ చేసి న్యాయం చేయాలన్నారు. గిరిజన తెగల్లో అధిక జనాభా కల్గిన యానాదులకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా నేటికీ వెనుకబడి ఉన్నారన్నారు. యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఇస్తామని ఎన్నికల ముందు హామి ఇచ్చిన చంద్రబాబు నాయడు గారు వెంటనే హామీ అమలు చేసి యానాదులకు న్యాయం చేయాలన్నారు. యానాదులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని, ఎస్‌టి కమిషన్ చైర్మన్ పదవి యానాదులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు కెసి పెంచలయ్య, చేవూరు సుబ్బారావు, చలంచర్ల పెదబ్రహ్మయ్య, చెంబేటి ఉష, రాపూరు కష్ణయ్య, తలపల చెంచు మల్లికార్జున, తలపల చంద్రమౌళి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి-నెల్లూరు

మధ్యాహ్నభోజన పథకం పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యధోరణతో వ్యవహరిస్తున్నాయని, బడ్జెట్‌లో ఈ పథకానికి కేటాయించే నిధుల్లో కోత విధిస్తుందని ఎపి మధ్యాహ్నభోజన పథకం కార్మిక యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ రెహెనాబేగం అన్నారు. ఆదివారం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి వి.ఆర్.సి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు మధ్యాహ్నభోజన పథకం కార్మికులతో ప్రదర్శన చేపట్టారు.ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలకు వెళ్తున్న పిల్లలు పేదరికం కారణంగా స్కూల్‌కు వెళ్లకుండా మానివేయకుండా ఉండేందుకు ప్రభుత్వం మధ్యాహ్నభోజన పథకాన్ని అమలు చేస్తుందన్నారు. భోజనం తయారు చేసేందుకు అవసరమైన సరుకులు, కూరగాయలు,వంట చేసేందుకు గ్యాస్ ఖర్చులను మధ్యాహ్నభోజన కార్మికులు భరిస్తూ కార్యక్రమాన్ని సజావుగా పూర్తి చేస్తున్నారన్నారు. అయితే గడిచిన మూడు నెలల నుంచి ఈ కార్మికులు ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా, వేతనాలు అందజేయకుండా అధికారులు నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఈ పథకాన్ని కేవలం ప్రచారం కోసం మాత్రమే ఉపయోగించుకుంటుందని, మధ్యాహ్నభోజన పథకం సజావుగా సాగించేందుకు అవసరమైన నిధులు కేటాయించే దిశగా పాలకులు, అధికారులు ఆలోచన చేయడం లేదన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే పలు మార్లు జిల్లా అధికారులను కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ వారి నుంచి ఎటువంటి స్పందన కానరావడం లేదన్నారు. అంతే కాకుండా మెనూ బిల్లులు పెంచాలని, ఈ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు రోజూ వారీ వేతనంగా రూ. 500లు అందజేయాలని డిమాండ్ చేశారు. ఇస్కాన్, అక్షయ పాత్ర నిర్వాహకులు పెడుతున్న భోజనంలో కోడిగుడ్లు ఉడికించే బిల్లులు సకాలంలో చెల్లించాలన్నారు.ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు బుజ్జయ్య, ఎస్‌కె ముంతాజ్, సునీత, రేవతి, రాములమ్మ, ఏ.అన్నపూర్ణమ్మ, సుభాషిణి, సంధ్యారాణి, జ్యోతి, మస్తానమ్మ, సిఐటియు నాయకులు మారుబోయిన రాజా. సిఐటియు రూరల్ కమిటీ నాయకురాలు ఎస్‌కె షాహినాబేగం, నిర్మాల ,రమణమ్మ ఉన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

సిఎం పర్యటన విజయవంతం

- ◆ప్రజలు, అధికారులకు ఎంఎల్ 'ఇంటూరి' ధన్యవాదాలు
- ◆'కందుకూరు'కు రూ. 50 కోట్లు నిధులు విడుదల

ప్రజాశక్తి-కందుకూరు : స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సిఎం నారా చంద్రబాబు నాయుడు కందుకూరు పర్యటన విజయవంతం చేసిన కందుకూరు నియోజకవర్గం ప్రజలకు అధికారులకు ఎంఎల్ఏ ఇంటూరి నాగేశ్వరరావు ధన్యవాదములు తెలిపారు. .ఆదివారం ఇంటూరి నాగేశ్వరరావు ఇక్కడ విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలపై గత ప్రభుత్వం చెత్త పన్ను వేయగా కూటమి ప్రభుత్వం వచ్చాక పన్ను రద్దుచేసి చెత్త నుంచి సంపద సష్టించేందుకు సిఎం చంద్ర బాబు నాయుడు కృషి చేస్తు న్నారని తెలిపారు. పట్టణంలో గత ప్రభుత్వంలో డంపింగ్ యార్డ్‌లో 26,000 టన్నుల చెత్తను వదిలి వెళ్లారని, అతి తక్కువ కాలంలో చెత్తను ఆ ప్రాంతంలో తీసివేసి ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కషి చేస్తున్నామన్నారు.పట్టణ ప్రజలు చెత్తను తడి , పొడి చెత్తగా వేరుచేసి పురపాలక సంఘ సానిటరీ వర్కర్లకు అందజేయాలని ప్రజలను కోరారు.కందుకూరు పురపాలక సంఘంలో మౌలిక వసతులు కల్పన కొరకు స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కందుకూరు విచ్చేసిన ముఖ్యమంత్రి రూ. 50 కోట్ల నిధులు విడుదల చేశారని తెలిపారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, రాష్ట్ర పార్టీ నాయకులు చిలకపాటి మధు, చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాద్, ముచ్చు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఇంటూరి

ఏఎన్‌ఎంల ఉద్యోగోన్నతులకు మళ్లీ బ్రేక్

డిఎంహెచ్ఒపై రాజకీయ ఒత్తిళ్లు..?

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

సచివాలయం కార్యదర్శులకు ఆరోగ్య సహాయకులుగా పదోన్నతులు కల్పిస్తూ ఆరు నెలల క్రితం నిర్ణయం తీసు కొన్న విషయం విధితమే. అయితే జిల్లా ఆరోగ్య శాఖ అ ధికారులు ముడుపులకు కక్కుర్తిపడి అనర్హులకు పదో న్నతులు కల్పించేందుకు రంగం సిద్ధం చేసినట్లు అప్పట్లో జరిగిన ప్రచారం నేపథ్యంలో పదోన్నతుల ప్రక్రియకు పు ల్స్టాప్ పడినట్లు సమాచారం. కాగా పదోన్నతులపై తా జాగా సచివాలయం కార్యదర్శుల విషయంలో ప్రభు త్వం తీసుకొన్న నిర్ణయానికి మరోమారు బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. అనర్హులకు పదోన్నతి అవకాశం ఇవ్వాలం టూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిపై వస్తున్న రాజకీ య వత్తిళ్ళే కారణమన్న గుసగుసలు ప్రస్తుతం వినిపిస్తు న్నాయి. జిల్లా వ్యాప్తంగా 813 మంది వరకు సచివాల యాల కార్యదర్శులు వున్నారు. కాగా పదోన్నతుల ప్రక్రి య సాఫీగా సాగివుంటే 813 మందిలో ర్యాంకులను బ ట్టి 280 మంది సచివాలయ కార్యదర్శులు ఆరోగ్య సహా యకులుగా కొనసాగుతారు. ఈ మేరకు గ్రేడ్ 3 ఏఎన్ ఎంలకు గ్రేడ్ 2 కింద పదోన్నతులు లభిస్తాయి. పదోన్న తులు పొందిన అనంతరం సచివాలయాల ఏఎన్‌ఎంలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏఎస్‌ఎంలుగా (ఎంపిహె చ్‌ఎ (ఎఫ్)లుగా కొనసాగుతారు. అయితే ర్యాంకుల మే రకు అర్హులైన వారి జాబితాను ప్రస్తుతం ఆరోగ్య శాఖ అ ట కెక్కించినట్లు సమాచారం. వీటన్నిటిని కాస్త పక్కన బెడితే ఆరు నెలల క్రితం ప్రకటించిన పదోన్నతుల ప్రక్రి య పలు కారణాల వల్ల నిలిచిపోగా, తాజాగా రాజకీ య జోక్యంతో పదోన్నతుల ప్రక్రియకు మళ్ళీ బ్రేక్ పడ డం విచారకరం.ఏదేమైనా ఆరు నెలల క్రితమే పదో న్న తులు పొందాల్సిన నేపథ్యంలో తాజాగా మరోమారు అ వాంతరం కలగడంతో సచివాలయాల ఏఎన్‌ఎంలు తీవ్ర నిరాశ నిస్పృహలకు గురౌతున్నారు.



శాంతిభద్రతలను పరిరక్షించాలి : సిపిఐ

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక ఆజాద్ సెంటర్లో స్వామి వివేకానంద విగ్రహాన్ని బిజెపి నాయకులు నిర్మించి మతకలహాలు సష్టించే ప్రయత్నం చేస్తున్నారంటూ సిపిఐ నగర కమిటీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఈ మేరకు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. సిపిఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ మాట్లాడుతూ 2008 ఆగస్టు 15వ తేదీ అమరవీరుల స్మారక స్తూపంతో జాతీయ జెండాని నిర్మించారన్నారు. అయితే అప్పటినుండి ఇప్పటివరకు ఆగస్టు 15, జనవరి 26వ తేదీ జాతీయ జెండా నిగరవేస్తూ పార్టీలకు కులమతాలు అతీతంగా ఒక పండుగగా కార్యక్రమాలు చేపడుతూ వచ్చామన్నారు. అయితే 2024 డిసెంబర్ 2న జాతీయ జెండాకు మరమ్మతులు చేస్తున్న సందర్భంలో బిజెపి నాయకులు వచ్చి జాతీయ జెండా మరమ్మతులు నిర్మాణాన్ని అడ్డుకున్నారన్నారు. పోలీసుల జోక్యంతో సమస్య పెద్దది అవ్వకుండా ఒక ఒప్పందానికి వచ్చారన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన బాధ్యత మంత్రి నారాయణపై ఉందన్నారు. ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు అజీజ్ అహ్మద్, టిడిపి నాయకులు ఖాదర్ భాష, మైనార్టీ నాయకులు జియా, వాజీద్, మున్వర్, షఫీ, ని సార్, అక్బర్, నవాజ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-నెల్లూరు

ఎన్నో ఆశలతో కోరి మరీ కూటమి ప్రభుత్వానికి ఉపాధ్యాయులు అధికారాన్ని కట్టబెడితే, ఆ అధికారాన్ని చేజిక్కించుకున్న అనంతరం ఉపాధ్యాయులకు చుక్కలు చూపిస్తుందని ఉపాధ్యాయ సంఘం పిఆర్‌టియు జిల్లా కమిటి ఆందోళన వ్యక్తం చేసింది. ఆదివారం ఈ మేరకు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం జరిగిన ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశానికి హాజరైన వారికి ముఖ హాజరును 6 గంటల వరకు అధికారులు అనుమతించకపోవడం దుర్మార్గమన్నారు.హాజరు కాని ఉపాధ్యా యులు ఉన్నతాధి కారులకు సంజాయిషీ ఇవ్వాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు వేదింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు.ఈ విషయాలు విద్యాశాఖ మంత్రికి తెలిసి జరిగినా తెలియకుండా జరిగినా చివరకు జరిగే నష్టం మాత్రం కూటమి ప్రభుత్వానికే జరుగుతుంది కాబట్టి ప్రభుత్వం మేలుకుంటే మంచిదన్నారు.పూర్తి స్థాయిలో జివో 117ను రద్దు చేయకుండా మీనమేషాలు లెక్కించడం ప్రభుత్వానికి సరికాదన్నారు.

వికలాంగులకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి- కందుకూరు : ఆకలితో ఉన్న వారి ఆకలిని తీరుద్దాం.. వాళ్ల కళ్లలో ఆనందాన్ని చూద్దాం.. అనే నినాదంతో నిరంతరం పేదవారి అవసరాలను తీర్చే దిశగా శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రవ్వా శ్రీనివాసులు పుట్టిన రోజు సందర్భంగా వారి సహ కారంతో మధిర ఆదరణ అనాధ వద్ధాశ్రమం, పాపానాయుడు పేటలోని లక్ష్మీ నరసింహ అనాధ వద్ధాశ్రమాలలో ఉన్నవారి మధ్య కేక్ కటింగ్, ఆహారం ఏర్పాటు చేశారు. స్వర్ణ స్వయం కషి మానసిక దివ్యాంగుల ఆశ్రమంలోని పిల్లలకు సాయంత్రం అల్పాహారం పంపిణీ చేశారు. ఆల్ ఇండియా వాసవి సత్ర సము దాయాల మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడుతూ డాక్టర్ రవ్వా శ్రీనివాసులు ఇటువంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రవ్వా శ్రీనివాసులు, కోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



లైఫ్ సర్టిఫికెట్లు వెంటనే అందజేయాలి

ప్రజాశక్తి-కోవూరు



కోవూరు సబ్ ట్రెజరీ పరిధిలో మొత్తం 1460 మంది పింఛన్‌దారులు ఉన్నారని, ఇప్పటివరకు 1131 మంది మాత్రమే తమ లైఫ్‌సర్టిఫికెట్లు అందజేశారని, మిగిలిన వారికీ త్వరగా అందజేసేలా చర్యలు తీసుకోవాలని సబ్ ట్రెజరీ అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా 337మంది తమ లైఫ్‌సర్టిఫికెట్లను అందజేయాల్సి ఉందని, ఫిబ్రవరి 28వ తేదీలోగా వారందరికీ అందజేయాలన్నారు. లేనిపక్షంలో మార్చిలో వారికి వారివారి ఖాతాలో పింఛన్ నిధులు మంజూరు కావన్నారు. పింఛన్‌దారులు జీవన్ ప్రమాణ్ యాప్‌లో కానీ, ఎస్‌టిఒ కార్యాలయానికి వచ్చి గానీ లైఫ్‌సర్టిఫికెట్లను అందజేయవచ్చన్నారు.



అన్నదానం చేస్తున్న దాతలు

గిరిజన కాలనీలో అన్నదానం

ప్రజాశక్తి-కావలి

లైఫ్‌లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తాటికొండ నవీన్ సౌమ్య దంపతుల కుమార్తె 'లౌక్య' పుట్టినరోజు సందర్భంగా ఆదివారం కావలి ముసునూరు మర్రిచెట్టు గిరిజన కాలనీలోని కొత్త గిరిజన కాలనీలో లౌక్య పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్‌అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి మాట్లాడుతూ తాటికొండ నవీన్, సౌమ్య దంపతుల కుమార్తె 'లౌక్య' పుట్టినరోజు సందర్భంగా కావలిలోని మర్రిచెట్టుగిరిజన కాలనీలోని గిరిజన ప్రజలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. తాటికొండ నవీన్ ఉన్నత విద్యను అభ్యసించి వారి నాన్న స్ఫూర్తితో లైఫ్‌లైన్ ఫౌండేషన్ స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. వారి పాప మొదటి పుట్టినరోజు గిరిజనుల ప్రజల సమక్షంలో చేసుకోవటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లౌక్య తల్లి దండ్రులు నవీన్, సౌమ్య, లైఫ్‌లైన్ ఫౌండేషన్ సభ్యులు స్రవంతి, శశాంక్, సహస్ర పాల్గొన్నారు.



బోల్తాపడిన ఆటో

ఆటో బోల్తా..

- తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు పట్టణ పరిధిలోని పీటర్‌సన్ కాలువ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం నెల్లూరు నుంచి కోవూరుకు వస్తున్న ఆటో రోడ్డుకు అడ్డంగా వంద ఇరావడంతో అకస్మాత్తుగా డ్రైవర్ బ్రేక్ వేయడంతో ఈ నేపథ్యంలో ఆటో ఒక్కసారిగా బోల్తా పడిన ఘటన చోటుచేసుకుంది. ఈ సమయంలో ఆటోలో ఇరువురు మహిళలు మాత్రమే ప్రయాణం చేస్తున్నారు. ఈ సమయంలో ఆటో పక్కనే ఉన్న కాలువలో పడి ఉంటే ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు భావిస్తున్నారు. ప్రధానంగా ఈ పీటర్‌సన్ కాలువకు సైడు గోడ లేకపోవడంతో ఇటీవల కాలంలో అనేకసార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి ఈ పీటర్‌సన్ కాలువకు సైడు గోడ నిర్మించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



తక్కువ ఎత్తులో ఉన్న కరెంటు తీగలు

కరెంటు తీగలను సరిచేయాలి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండల కేంద్రంలోని దర్గా సెంటర్లోని కరెంటు తీగలను సరి చేయాలని స్థానిక షాపుల యజమానులు కోరుకుంటున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సర్వే పేరుతో ఏరియా అంతా అస్తవ్యస్తంగా మారిందని, కరెంటు తీగలు మార్చడానికి కొత్త స్తంభాలను సైతం నాటడం జరిగిందని, కానీ ఆ స్తంభాలకు విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేయడంలో విద్యుత్ అధికారులు నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తున్నారని పత్రికా ముఖంగా వాపోయారు. ఇకనైనా ఉన్నతాధికారులు, విద్యుత్ అధికారులు ఈ విషయాన్ని గమనించి కొత్తగా ఏర్పాటు చేసిన స్తంభాలకు ఆ తీగలను ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నారు.



మాట్లాడుతున్న పిఎన్‌ఆర్‌వి ప్రసాద్

న్యాయవిద్యార్థులకు విస్తృత అవకాశాలు

- హైకోర్టు న్యాయవాది పిఎన్‌ఆర్‌వి ప్రసాద్

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

న్యాయరంగంలో ప్రపంచస్థాయిలో న్యాయ విద్యార్థులకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని హైకోర్టు న్యాయవాది పిఎన్‌ఆర్‌వి ప్రసాద్ పేర్కొన్నారు. నెల్లూరు లా స్టూడెంట్స్ అసోసియేషన్ (నెల్సా) ఆధ్వర్యంలో సరస్వతి నగర్‌లోని కృష్ణచైతన్య జూనియర్ కాలేజ్‌లో ఆదివారం న్యాయ విద్యార్థులకు సెమినార్ జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రధానవక్తగా ఆయన హాజరై మాట్లాడారు. న్యాయ విద్యర్థులకున్న అవకాశాలను వివరించారు. ప్రభుత్వ సంస్థలలో ఇంటర్న్‌షిప్‌లు, ప్రాక్టీస్ డొమైన్‌లు, విదేశీ వ్యవహారాల్లో ప్లేస్‌మెంట్‌లు, మేధో సంపత్తి, లాఛాంబర్‌లలో స్థానాలు, సైబర్‌చట్టం, ఫోరెన్సిక్ అవకాశాలు, మొదలైన వాటికి సంబంధించిన మార్గాలను వివరించారు. న్యాయవాదుల్లో ప్రముఖ వ్యక్తిగా ఉండేందుకు న్యాయవాది నైతికత, నైపుణ్యాలు, జ్ఞానం అవసరమన్నారు. న్యాయ విద్యార్థులకు, భవిష్యత్తులో విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. అందుకోసం విద్యార్థులు తగిన విధంగా చదవాలన్నారు. అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రయత్నం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు సుధీర్, దీక్షిత్, రూహి, కిరణ్, న్యాయవిద్యార్థులు, శివ, ప్రసాద్, సుధీర్, ప్రియాంక, రవి, షరీఫ్, రాణా ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు గుర్తించి నోటీసులిస్తాం..

అదనపు కమిషనర్ వై.ఒ. నందన్

ఇంటర్వ్యూ



ప్రజాశక్తి-నెల్లూరు

నగర పాలక సంస్థ పరిధిలో ఇటీవల కాలంలో నూతన భవన నిర్మాణాలు చకచకా సాగుతున్నాయి. నగర పాలక సంస్థ పరిధిలో ఖాళీ స్థలం ఉంటే ఆ స్థల యజమాని కార్పొరేషన్‌కు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. నూతన భవన నిర్మాణ పనులు నిర్వహిస్తుంటే కార్పొరేషన్ పరిధిలోని ప్లానింగ్ విభాగం నుంచి అనుమతులు తీసుకొని ప్రభుత్వ నిబంధనల మేరకు స్థల రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాకుండా తాగునీటి సరఫరా కోసం దరఖాస్తులు చేసుకొని కనెక్షన్ తీసుకున్న అనంతరం ప్రతి 6నెలలకు ఒకసారి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కార్పొరేషన్ పరిధిలో పన్ను వసూళ్లు ఏ విధంగా చేస్తున్నారో అదనపు కమిషనర్ వై.ఒ.నందన్ మాటల్లో...

ప్రశ్న. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్‌లలో అనధికార, అక్రమ నిర్మాణాలను గుర్తించి వాటి యజమానులకు నోటీసులు పంపినీ చేశారా.. పన్ను వసూళ్లకు ఎటువంట చర్యలు తీసుకున్నారు...?

జవాబు. ప్రతిఒక్క వార్డు ప్లానింగ్ కార్యదర్శి తమ లాగిన్‌లను ప్రతినిత్యం తనిఖీ చేసుకోవాలని సూచనలు చేశాం. లాగిన్‌లలో ఏలాంటి ఫైళ్లు పెండింగ్లో ఉంచుకోకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం కోసం ఉన్నతాధికారులకు ఫార్వార్డ్ చేయాలని కోరాం. సంబంధిత షార్ట్ ఫాల్స్‌ను ఉన్నతాధికారులకు తెలియజేసి క్లియర్ చేయించాలని తెలిపారు. అనధికార, అక్రమ నిర్మాణాలపై పి.ఒ., సి.ఒ. నోటీసులను జారీ చేసి అవసరమైన పక్షంలో చార్జి షీట్లను దాఖలు చేయాలని సిబ్బంది సూచనలు చేశాం. అనధికార లేఅవుట్లను గుర్తించి వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలని, ఎల్.ఆర్.ఎస్. పథకంపై మెగామేళాను నిర్వహించనున్నారని, ప్రతిఒక్క లేఅవుట్ యజమానికి సమావేశంపై అవగాహన కల్పించి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచనలు చేశాం.

ప్రశ్న. తాగునీటి కొళాయి పన్ను బకాయిల వసూళ్లను ఎటువంటి చర్యలు తీసుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31వ తేదీ నాటికి నిర్ధేశించిన లక్ష్యాలను అందుకునేందుకు కేవలం 45 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని కదా.. పన్ను వసూళ్లకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు. నగర పాలక సంస్థ పరిధిలోని తాగునీటి కొళాయి పన్నుల వసూళ్ల కోసం నిర్ధేశించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేసి, 100 శాతం లక్ష్యాలను సాధించాలని సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులకు కార్పొరేషన్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశాం. ఈ పన్ను వసూళ్ల వ్యవహారంపై నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, టిడ్కోవిభాగం, హౌసింగ్ విభాగం, సచివాలయ అమెనిటీస్ కార్యద ర్శులతో కమాండ్ కంట్రోల్ విభాగంలో ఇటీవలే సమీక్ష సమావేశాన్ని నిర్వహించాం. పన్నుల వసూళ్లకు ప్రతిరోజు ఉదయం నుంచి క్షేత్రస్థాయిలో పర్యటించాలని, పన్ను బకాయిలు ఉన్న ప్రతిఒక్క ఆస్తి యజమానికి నోటీసులు జారీ చేసి నిర్దేశించిన సమయంలోపు చెల్లించని పక్షంలో తాగునీటి కుళాయి కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నాం. అందుబాటులో లేని భవన యజమానులను ఫోన్ ద్వారా సంప్రదించి ఆన్‌లైన్ పేమెంట్ చేయించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు చేశాం. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31వ తేదీ నాటికి నిర్ధేశించిన లక్ష్యాలను అందుకునేందుకు కేవలం 45రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని గుర్తు చేశారు. సచివాలయాల వారీగా సంబంధిత డిఇఇలు, ఎఇలు పన్ను వసూళ్ల ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొని మొండి బకాయిలు వసూలు అయ్యేలా చర్యలు తీసుకున్నాం. సచివాలయాల వారీగా నిర్ధేశించిన వారాంతపు లక్ష్యాలలో కనీసం 25శాతం తగ్గకుండా వసూలు చేయాలని, ఇంటింటి సర్వేలో భాగంగా గుర్తించిన డబుల్ ఎంట్రీలు, రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించబడిన కొళాయిలు తదితర వాటి పూర్తి నివేదికను కౌన్సిల్ వారికి నివేదించిన పిదప కౌన్సిల్ వారి అనుమతితో సి.డి.ఎం.ఎ. వారికి నివేదికలు పంపిన పిదప తదుపరి చర్యలు చేపట్టుట కోసం సచివాలయాల వారీగా లిస్టును అందజేయాలని సిబ్బందికి సూచించాం. తాగునీటి కొళాయి పన్నుల వసూళ్లలో వార్డు సచివాలయ అడ్మిన్, కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ అమెనిటీస్ కార్యదర్శులు వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని, మొండి బకాయిదారులను గుర్తించి అమలులో వున్న మున్సిపల్ చట్టప్రకారం వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రశ్న. నగర పాలక సంస్థ అధికారులు భవన నిర్మాణ యజమానుల నుంచి, ఖాళీస్థలాల యజమానుల నుంచి పన్నులు వసూళ్ల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు కదా.. అదే సమయంలో ఆయా ప్రాంతాల్లో స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్‌లలో స్థానిక సమస్యలను ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారాలు పొందాలి. ప్రజల నుంచి ఎక్కువగా రోడ్ల మరమ్మతుల పనులు, నూతన రోడ్ల మంజూరుకు, నూతనంగా డ్రెయిను కాలువల నిర్మాణం కోసం విజ్ఞాపనలు అందుకుంటున్నాం. మౌలిక వసతుల కల్పనలో స్థానికులు కూడా భాగస్వాములు అయితే పనులు మరింత పారదర్శకంగా వేగవంతంగా పూర్తి చేయగలం. టిడ్కో గృహాలను పొందేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపిస్తున్నారని, అయితే బ్యాంకు రుణాలు పొందేందుకు తప్పనిసరిగా మంచి సిబిల్‌స్కోర్ వారికి ఉండాలని సూచించారు. టిడ్కో గృహాలు క్యాన్సిల్ అయిన వారికి వారు చెల్లించిన మొత్తాలను తిరిగి చెల్లించడంతోపాటు, ఆయా గృహాలను నూతన లబ్ధిదారులకు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక సమస్యలను కమాండ్ కంట్రోల్ విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్‌కు ఫోన్ ద్వారా తెలియజేస్తే తక్షణమే స్పందించి ఫిర్యాదును పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. టిడ్కో గృహాలలో లబ్ధిదారులను సచివాలయాల వారీగా చేర్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని, గృహ సముదాయాల ప్రాంగణంలో అన్నిరకాల మౌలిక సదుపాయాలను కల్పించామని లబ్ధిదారుల్లో అవగాహన పెంచాలని అమెనిటీ కార్యదర్శులకు సూచించారు.

మన్నవరం మల్లయ్య సిపిఎం సభ్యులు కాదు..

ప్రజాశక్తి-నెల్లూరు

రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు గ్రామానికి చెందిన మన్నవరం మల్లయ్య సిపిఎం నాయకులు కారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు, రూరల్ మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధన్ తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. నెల్లూరు వైసిపి పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు ఆదాల.ప్రభాకర్ రెడ్డిని సిపిఎం నాయకులుగా మన్నవరం మల్లయ్య కలసి దుశ్శాలువాతో సత్కరించారని సోషల్ మీడియాలో రావడాన్ని ఖండిస్తున్నామన్నారు. మన్నవరం మల్లయ్యను గతంలోనే గ్రామంలోని చిన్న, సన్న రైతులైన లోతట్టు చెరువు సాగుదారులకు వ్యతిరేకంగా పనిచేయడంతో సిపిఎం శాఖ నుంచి తొలగించామన్నారు. అప్పటినుండి ఆయన వైసిపికి అనుకూలంగా పని చేస్తున్నాడని, కాబట్టి ఆయన సిపిఎం నాయకులు కాదని వివరంగా తెలియజేస్తున్నామన్నారు.

ఎస్ఐ సైదులుకు అవార్డు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట



మాదకద్రవ్యాల నిరోధక చట్టంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో చేపట్టిన పరీక్షలో ఎస్ఐ ఎ.సైదులుకు మొదటి బహుమతి లభించింది. తిరుపతి కళ్యాణి డ్యామ్ ప్రాంతంలో పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో, ఉమ్మడి నెల్లూరు జిల్లా, ఉమ్మడి రాయలసీమ ప్రాంతాల పలువురు పోలీస్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ ముగింపు కార్యక్రమంలో ఎస్ఐ సైదులుకు ప్రథమ బహుమతి అందించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని ఎఎస్ఐ భాస్కర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, ఎస్ఐ సైదులుకు శుభాకాంక్షలు తెలియజేశారు.



మాట్లాడుతున్న నాయకులు

రైతులకు మద్దతు ధర కల్పించాలి

ప్రజాశక్తి-జలదంకి

రైతులకు మద్దతు ధర కల్పించాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని రైతు సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆదివారం జలదంకిలోని సురే చెంచురెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 22వ తేదీన శనివారం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి కావలి, జలదంకి, బోగోలు మండలాల రైతులు విరివిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి మాల్యాద్రి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రావి మాల్యాద్రి, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం మాల్యాద్రి, రైతు సంఘం మండల కమిటీ సభ్యులు నరసింహులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

అభాగ్యులకు 'మన ఫౌండేషన్' అండ..

ప్రజాశక్తి-ఉదయగిరి

మండలంతో పాటు నియోజవర్గంలో మన ఫౌండేషన్ అభాగ్యులకు అండగా నిలుస్తూ అవసరం వచ్చిన ట్రస్టు సభ్యులతో తన దృష్టికి వచ్చిన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు నూతన వధూవరులకు విద్య తదితర రంగాల వారికి ఆదుకునేందుకు మన ఫౌండేషన్ అధినేతగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి మన్నేటి.వెంకటరెడ్డిగా తమ వంతు సహాయంగా బాధితులకు తదితరులకు ఆర్థికసాయం అందజేస్తూ అందరి మన్నులు మన్నేటి వెంకటరెడ్డి పొందుతున్నారు. అందులో భాగంగా ఆదివారం మండలంలోని కొండాయపాలెం పంచాయితీ గంగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బసిరెడ్డి రామారావు కుమార్తె గుండె సమస్యతో బాధపడుతున్న పాపకు రూ.5వేలు, అదే గ్రామానికి చెందిన దేవండ్ల రమణయ్య ఆటో ప్రమాదంలో గాయపడ్డా తనను పరామర్శించి, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఫౌండేషన్ అధినేత, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మనీస్కామ్ నిర్వాహకులను శిక్షించాలి

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

కావలి అనంతార్థ అసోసియేషన్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన భాదితులను న్యాయం చేయాలని కావలి పట్టణ వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. అదివారం కావలి సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వామపక్ష పార్టీల నాయకులు సమావేశమయ్యారు. మనీస్కామ్‌లో నష్టపోయిన భాదితులను వామపక్ష పార్టీల నాయకులు ఆదివారం విచారించారు. వారికి అండగా ఉంటామని భాదితులకు భరోసానిచ్చారు. మనీస్కామ్‌లో ఏజెంట్లుగా ఉండి, మనీస్కామ్‌కు అండగా నిలిచిన ప్రభుత్వ అదికారులు, పోలీసు అదికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ మనీస్కామ్‌పై సమగ్ర విచారణ జరిపించి, నిర్వాహకులను ఏజెంట్లను కఠినంగా శిక్షించాలన్నారు. మనీ స్కామ్‌లో చిన్నస్థాయి వారిపై చర్యలు తీసుకొని పైస్థాయి అధికారులను రక్షించే ప్రయత్నాలను విరమించు కోవాలన్నారు. మనీస్కామ్‌లో చట్టాన్ని రక్షించి బాధితులను కాపాడాల్సిన ప్రభుత్వ అదికారులు, పోలీసు ఉండడం చూస్తే "కంచే చేను మేసే చందం"గా ఉందని వామపక్ష పార్టీలు అవేదన వ్యక్తం చేశారు. 2024 అగస్టులో మనీస్కామ్ గురించి పత్రికా ప్రకటన వచ్చిన క్షుడ పోలీసు దృష్టి సారించలేదన్నారు. కోట్లది రూపాయలు ప్రజల నుంచి దండుకున్నారని వామపక్ష పార్టీలు అబిప్రాయపడ్డాయి. నేరాన్ని అరికట్టాల్సిన పోలీసులు ఏజెంట్లుగా ఉండడం వల్ల కూడా ప్రజలు మరింతగా నష్టపోవడానికి కారణమైంద న్నారు. అనేక రాష్ట్రంల్లో ఈ తరహా నేరాలకు పాల్పడిన వ్యక్తికి కావలిలో పోలీసు అదికారులు కొమ్ముకాయడం అత్యంత విచారకర మన్నారు. విచారణ పేరుతో కాలయాపన చేయడం పోలీ సులు పాత్రదారులుగా ఉండటం వల్ల బాధితులకు న్యాయం జరుగుతుందనే అశ సన్నగిల్లుతుందనే అభిప్రాయం ప్రజల్లో నెలకొని ఉందన్నారు. తక్షణమే ఈ స్కామ్ నిజనిజాలు ప్రజలకు తెలియ జేయాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. సమగ్ర విచారణ జరిపించి స్కామ్‌లో అన్నిస్థాయి పోలీసులపై చర్యలు తీసుకుని, ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం సడలకుండా చేయాలని కోరారు. ఒకనాడు హిమ్ నుండి నేటి అనంతార్థ మనీస్కామ్ వరకు ప్రజలు నమ్మి కోట్లాది రూపాయలు నష్టపోతున్నారన్నారు. ఆన్‌లైన్ ట్రేడింగ్, షేర్లు, కాటన్, బెట్టింగ్ వంటి జూదాల్లో ప్రజలు నష్టపోతున్నారన్నారు. ఇటు వంటి మోసా లు, జూదాలపై ప్రజలు అప్రమత్తం గా ఉండాలని, అత్యాశకు పోకుండా ఇటు వంటివి తమ దృష్టికి వచ్చినప్పుడు పోలీసు దృష్టికి తీసుకోవాలన్నారు. మనీస్కామ్‌లో బాధితులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటామని, వామపక్ష పార్టీలు తెలియజేశాయి. కార్యక్రమానికి సిపిఐ నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, కె.నాగ రాజు, దమ్ము దర్గాబాబు, సిపిఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, సిపిఐఎంఎల్ నాయకులు లక్ష్మిరెడ్డి, కరవది బాస్కర్, మల్లె అంకయ్య, చిట్టి బాబు, చేవూరు కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-కోవూరు



మాట్లాడుతున్న వ్యవసాయ సంచాలకులు సుజాత

కోవూరు వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన రైతులు వారికి సంబంధించిన ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యకు తప్పక నమోదు చేసుకోవాలని వ్యవ సాయ సంచాలకులు సుజాత అన్నారు. కోవూరు మండలం గంగవరం గ్రామ సచివాలయంలో ఆదివారం ఆమె గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతుకు ఒక గుర్తింపు సంఖ్య ఇవ్వడం జరుగుతుందని, ఈ గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిష్టర్ పోర్టర్లో నమోదు చేసి భూమి ఉన్న ప్రతి రైతుకు కేటాయించడం జరుగుతుంద న్నారు. ఈ విశిష్ట సంఖ్య వల్ల ప్రభుత్వం ద్వారా విడుదల చేసే సబ్సిడీలు, ఇతర గుర్తింపునకు పనిచేస్తుందన్నారు. రైతులు ఈ సంఖ్య కోసం నమోదు చేసుకునేందుకు తమ ఆధార్ నెంబర్‌తో పాటు ఆధార్ అనుసంధానమైనా ఫోన్ నెంబర్, పట్టాదారు పాసు పుస్తకం తీసుకుని వారివారి గ్రామాల్లోని వ్యవసాయ సహాయకులను కలిసి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవాలన్నారు. మొత్తం కోవూరు నబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల కు ఈ విశిష్ట గుర్తింపునకు గానూ 13961 మంది రైతులను గుర్తించినట్లు, ఇప్పటివరకు 5649 మంది రైతులు ఈ సంఖ్య కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. మిగిలిన 8203 రైతులు 28వ తేదీలోగా తప్పక నమోదు చేసుకోవాల న్నారు. నమోదు చేసుకున్న వెంటనే వారికి యూనిక్ ఐడి కూడా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు చాద్విక, రైతులు ఉన్నారు.



ప్రమాదంలో ప్రజారోగ్యం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

సమస్త జీవకోటికి ఆధారంగా పుడమినీ ప్లాస్టిక్ వ్యర్థాలు నిర్ణయిస్తున్నాయి. గాలి, నీరు, నేల ఇలా అన్నింటిలో ప్లాస్టిక్ కాలుష్యం ఏటకేటా పెరుగుతున్నాయి. తినే తిండిలోనూ ప్లాస్టిక్ అవశేషాలు ఉంటున్నాయనేది పరిశోధనలో శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. ఆత్మకూరు పట్టణంలోని ప్లాస్టిక్ కవర్ల వినియోగం కారణంగా పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి. అధికారుల అలసత్వం కారణమో ప్రజల అవగాహన రాహిత్యమో తెలియదు గానీ భుజించే పదార్థాలలోనూ దాని వాడకం క్రమేణా పెరిగిపోతుంది. ఈ ప్లాస్టిక్ కణాలు మెల్లగా ప్రజల శరీరంలోకి చేరి కేన్సర్ కారకాలుగా మారిపోతున్నాయి. వారి జీవితాలను నాశనం చేస్తున్నాయి. గత 15యేళ్ల క్రితం ఎంతో పరిశు భ్రంగా ఉన్న ఆత్మకూరు పట్టణం నేడు దుర్గంధంలో ప్రజల ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చింది. టీ షాపుల వద్ద వీటి వాడకం మొదలైంది. వేడిగా ఉండే టీ, ప్లాస్టిక్ కవర్లలో చిట్టి ప్రజలకు విక్రయిస్తున్నారు. వీటిని తీసుకువెళ్లే ప్రజలు నోటి ద్వారా తీసుకున్నప్పుడు ప్లాస్టిక్ కణాలు ఈ వేడిలో కరిగి ప్రజల శరీరాల్లోకి ప్రవేశిస్తున్నాయి. తద్వారా కొన్నేళ్ల తర్వాత ప్రజలు కేన్సర్ వ్యాధికి గురై ప్రాణాలు కోల్పోతున్నారు. మద్యం దుకాణాల సమీపంలో మద్యం తాగేందుకు అనుమతులు లేనప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్లాస్టిక్ వాటర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ గ్లాసులు మద్యం సేవిస్తూ వాటిని అక్కడ ప్రదేశాలలో డ్రెయినేజీ ప్రదేశాలలో పరవేస్తున్నారు. పరిసరాలను మురికిగా మారుస్తున్నాయి. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు కఠినమైన చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యాలను ప్రాణాలను కాపాడాలని కొంతమంది శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు.

'స్వాతంత్ర్యోద్యమం-ఆంధ్ర ముస్లిముల'పై పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న వక్తలు



పుస్తకావిష్కరణ చేస్తున్న ఎంఎల్ఎ వెంకటకృష్ణారెడ్డి

ప్రముఖ రచయిత, విశ్వోదయ బాలుర పాఠశాల పూర్వ విద్యార్థి, సయ్యద్ నసీర్ ఆహమ్మద్ రచించిన, "భారత స్వాతంత్ర్యోద్యమం - ఆంధ్ర ముస్లిముల చరిత్ర" పుస్తకాన్ని ఆదివారం స్థానిక రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ భవనంలో కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. టిడిపి సీనియర్ నాయకులు, జనోపకారి పత్రిక సంపాదకులు షేక్.మస్తాన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి సభకు రచయితతో పాటు, ముఖ్య అతిథులుగా అధ్యాపకులు అన్నదాత మణి, పుస్తక ప్రచురణ కర్త, నెల్లూరు సీనియర్ జర్నలిస్ట్, రచయిత ఈతకోట సుబ్బారావు, డాక్టర్ బెజవాడ రవికుమార్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పి.ఐ. జాఫర్ ఖాన్, చాకలకొండ శారద, ఎం.ఎస్.ఆర్. డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ జి.రాజ్‌కుమార్ చౌదరి, ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్.రషీద్, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కిర్మాణి సఫ్దర్ హుస్సేన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశంలో సెక్యూలరిజంకు ప్రమాదం ఏర్పడి, మతోన్మాద శక్తులు విజృంభిస్తున్న తరుణంలో నేటితరం యువతకు చరిత్రను తెలియజేయాల్సిన అవసరముందన్నారు. చరిత్ర రానున్న తరాలకు చెప్పకపోతే జాతి నష్టపోతుందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో హిందువులు, ముస్లింలు భుజం, భుజం కలిపి పోరాడిన పోరాట స్ఫూర్తిని తెలియజేసే విధంగా ఈ పుస్తక రచయిత ప్రయత్నించిన చరిత్ర కారుడిగా అభివర్ణించారు. 25 పుస్తకాలు అధ్యయనం చేసి, 25 పుస్తకాలకు పైగా రచించిన నసీర్ అహమద్ ధన్యజీవి అన్నారు. స్వాతంత్ర పోరాటంలో జాతికి ద్రోహం చేసి, విప్లవకారుల ఆచూకీని తెలిపి, పట్టించి, ఆంగ్లేయుల బూట్లు నాకిన వారిని, నేటి దేశపాలకులు దేశ భక్తులుగా చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటివారి వల్ల చరిత్ర పరాయీకరణ చేయబడుతోందన్నారు. చరిత్రను వక్రీకరించడం జరుగుతోందన్నారు. నాటి జాతీయోద్యమం అన్ని జాతుల, మతాల, కులాల ఐక్యతతో ఉవ్వెత్తున లేచిన కెరటమన్నారు. అలాంటప్పుడు రచయిత జాతీయోద్యమం గురించి, అప్పటి ఆంధ్ర ముస్లిముల వీరోచిత పోరాటాల గురించి చక్కగా వివరిస్తూ పుస్తకం రాయడం రానున్న యువతకు అవగాహన కల్పించేదిగా ఉందన్నారు. అలాంటి రచయిత పక్కన వేదికపై కూర్చోవడం తమ భాగ్యంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు డి.రవిప్రకాష్, జెవివి నాయకులు షేక్.ఖాదర్‌బాషా, తోట వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు తిరువీధి ప్రసాద్, అభ్యుదయ వాదులు, ప్రజలు పాల్గొన్నారు.